హైదరాబాదు నోట్‌బుక్

శ్రీ దిగవల్లి వేంకట శివరావు :

'ఒక జట్కా సాయిబు తల్లికి కోడలి మీద కోపంవచ్చి, ఉమ్మెత్త విత్తులు నూరి అన్నంలో పెట్టింది. ఇంటిల్లిపాదికీ చచ్చేంత డోకులు ప్రారంభమయాయి. విషప్రయోగంతో హత్యా ప్రయత్నం చేసిందని పోలీసులు ఆమెపై కేసుపెట్టారు. జట్కా సాయిబువచ్చి అయ్యా, మా అమ్మ బుద్ధి గడ్డితిని విషం పెట్టింది. నా పరువు, ఆమె ప్రాణాలూ పోతాయి. ఆమెను కాపాడండి అని బతిమాలినాడు. నాకు అదే మొదటి కేసు. సరేనన్నాను. ఆలోచించాను. విరుద్ధాహారాలు తింటే విషమవుతుందని ఆయుర్వేదంలోను, అన్య వైద్య గ్రంథాల్లోను వుంది. కోర్టులో ఫిర్యాదీలను క్రాసు పరీక్ష చేయవచ్చుగదా! అప్పుడు పట్టుకుందామని నిర్ణయించుకొన్నాను. క్రాసు పరీక్షలో మీరు చేపలుతింటారా ? అనడిగాను. అవునన్నారు. ఎండుచేపల పులుసుకాచుతారా ? అనడిగాను. అవునన్నారు. ఎండుచేపలు చెడిపోతే ఉమ్మెత్తగింజల విషం వంటి విషం పుడుతుంది. ఇది చేపల పులుసులో కలిగిన విషంగాని, ఉమ్మెత్త విత్తుల విషంకాదు యువరానర్. ఎంత దుర్మార్గురాలయినా, తల్లి, తనకొడుకు కుటుంబాన్నంతా కూలుస్తుందా ? అని వాదించాను. మేజిస్ట్రేటు కేసు కొట్టివేశారు. ముసలమ్మ బతికింది. జట్కా సాయిబు వేయిదండాలు పెట్టాడు అని సహస్రాధిక మాసజీవి. ప్రముఖ న్యాయవాది శ్రీ దిగవల్లి వెంకటశివరావు అన్నారు. ప్రతివృత్తిలోను, చాల విషయాలు తెలుసుకోవడం అవసరం. ముఖ్యంగా రచయితకు, న్యాయవాదికీ చాల విషయాలుతెలియాలి. దానికితోడు సద్యస్స్ఫూర్తి కూడా కావాలి అంటారు దిగవల్లివారు. ఆయన పందొమ్మిదవ శతాబ్దం చివర [1898]న జన్మించారు. ఆయన ఒక సజీవ గ్రంథాలయం, నడయాడే విజ్ఞాన సర్వస్వం. ఆయన అభిమాన విషయం చరిత్ర. [illegible] ఐదు నిమిషాల సత్సాంగత్యం చాలు. మూడు పుస్తకాలు వ్రాయడానికి తగినంతసామగ్రి సులభంగా లభిస్తుంది. ఆయనొక సముద్రం.' ఉప్పు కావలసినవారు ఉప్పు, చేపలు కావలసినవారు చేపలు, రత్నాలు కావలసినవారు రత్నాలు తీసుకు వెళ్లవచ్చు. 82 సంవత్సరాలయినా కంటంలో జీర లేదు. స్మృతిలో [illegible]లేదు. విశ్లేషణలో వైశద్యం వీడిపోలేదు. సత్యదృష్టిలో నిశితత్వం కొరవడలేదు. ఆయన 1910 లో రాజమహేంద్రవరంలో వీరేశలింగం ఆస్తికోన్నత పాఠశాలలో ఫస్టుఫారం చదువుతుండగానే వందేమాతరం ఉద్యమ ప్రభావానికి లోనయ్యారు. "వందేమాతర మంచు నేడు వార్త యొకటిం పుట్టెనే, విపినచంద్రపాలు చేతవిత్తనము నాటిచనే" "వందే వందే సదాస్వదేశ మాతరం సదయ హృదయ. జనని నీకు చక్క మ్రొక్కెదం" అనే గీతాల నాదాలలో ఉర్రూతలూగారు. మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో బి. ఎ. చదివి, మద్రాసు లా కాలేజీలో న్యాయశాస్త్ర పట్టభద్రులయారు. న్యాయవాది వృత్తి అవలంభించారు. ఇరవయ్యవ శతాబ్దం పూర్వార్థం ఒక విధంగా న్యాయవాది యుగ మనవచ్చు. రాజకీయ, సాహిత్య, చరిత్ర, నాటకాది రంగాలలో ఎటుచూచినావారే. దిగవల్లివారుకూడా దీనికి అపవాదంకాదు. ఆయన తనకు అభిమాన విషయమయిన చరిత్రను తరచడం ప్రారంభించారు. దాని ఫలితమే కథలూ— గాథలూ [నాలుగు సంపుటాలు] విశాలాంధ్రం విస్మృతాంధ్రం, బెజవాడ బార్, మన పోలీసు వ్యవస్థ, సన్యాసుల స్వాతంత్ర్య సమరం, 1857 పూర్వరంగం, నీలాపనింద — మున్నగు రత్నాలు. పరిశోధకులకు కూడ తెలియని అపార చారిత్రక సామగ్రితుందిలాలు దిగవల్లివారి గ్రంథాలు. 1857 పూర్వరంగంలో మద్రాసులోని అప్పటి లిటరరీ సొసైటీ, ఏనుగుల వీరాస్వామి, గాజుల లక్ష్మీనరసింహసెట్టి, మున్నగు మహోద్దండ నాయకుల వివరాలు, దేశస్వాతంత్ర్యానికి మూలబంధం తీర్చిన వీరాగ్రేసరుల చరిత్రలు ఎప్పటికప్పుడు కొత్తగా కానవస్తాయి. ఈ పూర్వరంగం పేరనే విశ్వనాథ సత్యనారాయణగారి ప్రళయ నాయకుడు నవల ఆవిర్భావం. ఈషణత్రయాన్ని మించింది కీర్తిషణం కీర్తికండూతిలేని జీవి అరుదు. దిగవల్లి వారిని ఈ కీర్తిషణ సోకలేదు. 1975లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలో సన్మానిస్తాము దయచేయండి—అని రాష్ట్ర ప్రభుత్వం కోరితే నిస్సంకోచంగా నిరాకరించారు. ఆయన తెలుగు సాహిత్యానికి, తెలుగు దేశానికి ఎనలేనిసేవ చేసిన బ్రౌనును స్మరించని ప్రపంచ తెలుగు మహాసభలో నాకు సన్మానమెందుకంటారాయన. [సత్యాగ్రహోద్యమ కాలంలో ఆయన నిర్మాణ కార్యక్రమంపై వ్రాసిన గ్రంథాలను అప్పటి ప్రభుత్వంనిషేధించింది. స్మరించుకొని నవ్వుతూ, తన కిష్టంలేని వారిని నేటి ప్రభుత్వం కూడ అలానే నిషేధిస్తున్నదేమోనన్న భావం ప్రకటించారు] నిరంతర పరిశోధన పరాయణులయిన దిగవల్లివారు ప్రస్తుతం గ్రామ దేవతలను గురించి పరిశోధన చేస్తున్నారు. గ్రామ దేవతారాధన శాక్తంలో ఒక భాగమని, ఇది తెలుగు దేశం నుంచి దక్షిణాపథమంతటా వ్యాపించిందని, దానికి నేడు తమిళదేశం హరిజనులలో తెలుగులిపిలోని మంత్రాల తాయత్తులుకట్టుకోడం తార్కాణమని ఆయన అన్నారు. నేడుముఖ్యంగా సరైన విమర్శనంలేదు. ఆకాశానికెత్తడం, లేదా అధః పాతాళానికి తొక్కడం, అంతేకాని, వివేచనతో కూడిన విమర్శ కనిపించదు. ప్రాచీన భారతీయ సాంఘిక వ్యవస్థను గురించి తెలుసుకోవడానికిజరుగవలసినంత కృషి జరుగలేదు. 19 వ శతాబ్దికి సంబంధించిన చారిత్రక విశేషాలూ, ఆధారాలూ ఎన్నో లభిస్తున్నాయి. కాని మన ఉపేక్షవల్ల అవి క్రమంగా మాయమై పోతున్నవి అని దిగవల్లి వారి ఆవేదన. ఈ ఆవేదనను గ్రహించి విద్యావేత్తలు, పరిశోధకులు ఈ అపార, అగాధ విజ్ఞాన పారావారాన్ని వినియోగించుకొని తెలుగుజాతిని సంపన్నంచేయాలి. 19వ శతాబ్దంలో పుట్టిన విజ్ఞానమూర్తులు మనకు కొందరే మిగిలారు. వారిని వినియోగించుకొని, దీపమున్నప్పుడె ఇల్లు చక్కబెట్టుకోవాలనేసామెతను సార్థకం చేసుకోవాలి. లేకపోతే, చేతులు కాలిన పిదప ఆకులు పట్టుకొన్నట్లు అన్న సామెత అవుతుంది. తెలుగువారు ప్రాప్తకాలజ్ఞతకు ప్రతీక. మరి ఏట్లా ప్రవర్తిస్తారో !

ఉ ప శ్రు తి :

మీ ఆశ్రయంవల్ల మావాడు రాణించాడు. ఒక లక్షాధికారి అయ్యాడు—అన్నాడొక పత్రికాధిపతితో ఒక రచయిత ను గురించి "నిజమే! ఒక లక్షాధికారే అయ్యాడు. మావాడు లక్షల సర్క్యులేషన్ ఉన్నపత్రికను ఒక లక్షకు దింపాడు" అని అన్నాడు పత్రికాధిపతి.

—తిరుమల రామచంద్ర